

వైద్యులు బదిలీ.. పేదలే బలి

మార్కాపురం జిల్లా వైద్యశాలలో ఇప్పటికే 26 మంది వైద్యులను బదిలీ చేసిన ప్రభుత్వం మరికొందరు వైద్యులను బదిలీ చేసే యోచనలో ఉంది. - 8లో..



సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ టోకరా

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.1.10 లక్షలు కాజేశారని బాధితుడు ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు. - 8లో..

గరిష్టం/కనిష్టం
31/19

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జాతీయ తైక్వాండో పోటీల్లో సత్తా



న్యూ ఢిల్లీ లో విజయ కేతనం చూపుతున్న తైక్వాండో టీమ్

సంతనూతలపాడు: ఈ నెల 14, 15 తేదీల్లో న్యూఢిల్లీ లోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో రాష్ట్రం నుంచి 150 మంది తైక్వాండో క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. వారిలో ప్రకాశం జిల్లా నుంచి 70 మంది క్రీడాకారులు పాల్గొనగా 25 మంది గోల్డ్ మెడల్స్, 15 మంది సిల్వర్ మెడల్స్, 30 మంది బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఈ పోటీలకు ఉన్నం మారుతి ప్రసాద్ 8 డాన్, ఇండియా తైక్వాండో ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో వైకే శ్రీనివాసరావు ఏపీ స్టేట్ ఆర్గనైజర్ 4 డాన్, షేక్ హబిబుల్లా, పవన్, శరవన్, గోలి శ్రీను,సుభాని, లీల మైత్రి, శృతి తదితరులు నేతృత్వం వహించారు.

కేటాయించిన లక్ష్యాలు పూర్తి చేయాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



వీడియో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ఉపాధిహామీ పథకం కింద కేటాయించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, ఉపాధి పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రకాశం భవనం నుంచి మండల స్థాయి అధికారులతో గృహనిర్మాణాలు, ఉపాధి పనులు, పారిశుధ్యం, ఎంఎస్ఎంఈ, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు, మిస్సింగ్ సిటిజన్స్, మ్యాపింగ్, తదితర అంశాలపై వీడియో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవోలు, ఏపీడీలు క్షేత్రస్థాయిలో పర్యటించి ఉపాధి పనులు మానిటర్ చేయాలన్నారు. జిల్లాలో 3800 ఇళ్ల నిర్మాణాలు లక్ష్యం ఉంటే ఇప్పటి వరకు 2003 ఇళ్లు పూర్తి చేశారని, మిగిలినవి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో సీపీవో వెంకటేశ్వరరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ వెంకటనాయుడు, మెప్మా పీడీ రవికుమార్, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

20న మహిళలకు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు


గిద్దలూరు రూరల్: క్రిస్మస్ సందర్భంగా మండలంలోని ముండ్లపాడు గ్రామంలో సెయింట్ జాకబ్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 20, 21 వ తేదీల్లో మహిళలకు రాష్ట స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలో గెలుపొందిన వారికి రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు వరుస క్రమంలో బహుమతులు అందజేస్తారన్నారు. పూర్తి వివరాల కోసం సెల్:9676109792 నంబర్‌ను సంప్రదించాల్సిందిగా వారు కోరారు.



ఈమె పేరు చిలకల దేవి. బేస్తవారిపేట మండలం మోక్షగుండం గ్రామం. ఆమె ఇంటికి ఈనెల విద్యుత్ బిల్లులో 85 యూనిట్లు విద్యుత్ వినియోగిస్తే విద్యుత్ చార్జీ రూ.237, అదనపు చార్జీలు కలిపి రూ.400 బిల్లు వచ్చింది. ట్రూఅప్ చార్జీలు, ఫ్యూయల్ పవర్ పర్చేజ్ కార్డు ఎడ్జస్ట్‌మెంట్‌లు కొత్తగా వేయడంతో బిల్లు దాదాపు రెట్టింపైంది. గతంలో కరెంట్ బిల్లు రూ.250 వచ్చేదని అదనపు చార్జీలతో బిల్లు పెరిగిందని ఆమె వాపోతోంది.

''ఓటెయ్యండి తమ్ముళ్లూ..అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచం..పైగా తగ్గిస్తాం నేను గ్యారెంటీ'' అంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టిన చంద్రబాబు..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ వినియోగదారులకు వరుస షాక్‌లు ఇస్తున్నాడు. సర్‌చార్జీలు, ట్రూఅప్ చార్జీల పేరుతో అన్నివర్గాల ప్రజలపై ప్రభుత్వం పెనుభారం మోపింది. వాడుకున్న దానికన్నా రెండు రెట్లు బిల్లు రావడంతో జనం గగ్గోలు పెడుతున్నారు. విద్యుత్ వినియోగం తక్కువగా ఉండే శీతాకాలంలోనే ఇలా ఉంటే ముందు ముందు ఇంకెంత షాక్ ఇస్తారోనని బెంబేలెత్తుతున్నారు.

సామాన్యుడిపై సర్దుపోటు



- విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని ఎన్నికల ముందు నమ్మబలికిన చంద్రబాబు
- అధికారంలోకి రాగానే సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారం
- ఎఫ్‌పీపీసీఏ పేరుతో ఒక్కో బిల్లుపై అదనపు వడ్డన
- విద్యుత్ బిల్లు రూ.400 వస్తే అదనపు భారం మరో రూ.400
- ఘొల్లుమంటున్న వినియోగదారులు

బేస్తవారిపేట: కూటమి ప్రభుత్వం వినియోగదారులకు షాకిస్తోంది. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో బాదుడు మొదలుపెట్టింది. ఎన్నికల ముందు చార్జీలు పెంచబోమని, అవసరమైతే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని కూటమి నేతలు కల్లబొల్లి మాటలు చెప్పారు. ఇంటింటికీ తిరిగి విద్యుత్ బిల్లులు తగ్గిస్తామని ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీలన్నీ తుంగలో తొక్కి విద్యుత్ వినియోగదారులపై పెనుభారం మోపారు.

ఎఫ్‌పీపీసీఏ పేరుతో ఒక్కో బిల్లుపై బాదుడు..

ఇప్పటికే ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకూ గత ప్రభుత్వం ఇచ్చిన ఉచిత విద్యుత్‌ను దూరం చేసి బిల్లులతో బాదేస్తున్న కూటమి ప్రభుత్వం ఇతర వర్గాలపైనా పెనుభారం మోపుతోంది. గతంలో లేని ఎఫ్‌పీపీసీఏ (ఫ్యూయల్ పవర్ పర్చేజ్ కార్డు ఎడ్జస్ట్‌మెంట్) 2022 ఏడాదికి ఈనెల నుంచి, సర్ చార్జీలు, ట్రూఅప్ చార్జీల పేరుతో విద్యుత్ వినియోగాన్ని బట్టీ రూ.150 నుంచి రూ.250 వరకు అదనంగా బిల్లులో వచ్చింది. మొత్తంగా ఫిక్స్‌డ్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, సర్ చార్జీ, 2024, 2022కు సంబంధించిన ఫ్యూయల్ పవర్ పర్చేజ్ కార్డు ఎడ్జస్ట్‌మెంట్‌లు కలిపితే రూ.400 వినియోగించిన విద్యుత్ బిల్లుకు అదనంగా మరో రూ.400 వస్తుండటంతో విద్యుత్ వినియోగదారులు లబోదిబోమంటున్నారు. విద్యుత్ వాడకం తక్కువగా ఉండే శీతాకాలంలోనే బిల్లుల మోత ఇలా ఉంటే ముందు ముందు ఇంకెంత షాక్ ఇస్తుందోనని బెంబేలెత్తుతున్నారు.

జిల్లాలో డొమెస్టిక్ విద్యుత్ కనెక్షన్‌లు: 10,22,844

కమర్షియల్ విద్యుత్ కనెక్షన్‌లు: 1,04,728

రూ.22.55 కోట్ల అదనపు భారం..

జిల్లాలో డొమెస్టిక్ విద్యుత్ కనెక్షన్‌లు 10,22,844, కమర్షియల్ కింద 1,04,728 విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి.

11,27,572 విద్యుత్ కనెక్షన్‌లకు ఒక్కో బిల్లుపై సగటున రూ.200 చొప్పున రూ.22.55 కోట్ల అదనపు భారం వేశారు. గిద్దలూరు, మార్కాపురం మండలాల్లో మొత్తం విద్యుత్ కనెక్షన్‌లు 2,48,916 ఉన్నాయి. ఒక్కో బిల్లుపై సగటున రూ.200 చొప్పున దాదాపు రూ.5 కోట్లు అదనపు భారం పడింది.



విద్యుత్ బిల్లు రెట్టింపయింది



ఈనెల విద్యుత్ బిల్లు రెట్టింపైంది. గతంలో రూ.150 నుంచి రూ.200 బిల్లు వచ్చేది. ప్రస్తుతం రూ.450 నుంచి రూ.500 బిల్లు వస్తుంది. ఎన్నికల సమయంలో విద్యుత్ బిల్లులు పెంచమని, తగ్గిస్తామన్నారు. సామాన్యులపై ఇంత భారం మోపడం అన్యాయం.

– బండ్లపాటి అల్లూరయ్య, మొహిద్దీన్‌పురం

సామాన్యులకు భారం



కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరిగి విద్యుత్ బిల్లులు తగ్గిస్తామని చెప్పారు. ఒక్క రూపాయి కూడా బిల్లులు పెంచమన్నారు. నేడు అదనపు చార్జీల పేరుతో బాదుతున్నారు. సామాన్య ప్రజలకు భారంగా మారుతోంది.

– బొల్లా బాలిరెడ్డి, మాజీ సైనికుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు



అల్లూరయ్య కరెంట్ బిల్

పేద, మధ్య తరగతి ప్రజలకు ఇబ్బందులు



పేద ప్రజలపై విద్యుత్ భారం మోపడం సమంజసం కాదు. చంద్రబాబు కార్పొరేట్ నైజాన్ని మానుకోవాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఇలా విద్యుత్ బిల్లులు పెంచడంతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– ధాకాల పుల్లయ్య, నియోజకవర్గ రైతు సంఘం కన్వీనర్

సూపర్ సిక్స్ అమలు చేయమంటే 2047 విజన్ అట

- మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్



పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయమంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2047 విజన్‌ను తెరపైకి తెచ్చి హడావుడి చేస్తున్నాడని ఈ విజన్ ఇప్పుడు అవసరమా అని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో సోమవారం పార్టీ నూతన కమిటీలపై నాయకులతో గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ ఇప్పుడు ప్రజలకు ఏం చేస్తాడో చెప్పాలి కానీ 2047 లో ఏం చేస్తాడో ప్రజలకు అవసరమా అని ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రశ్నించారు. ఈ టీడీపీ వారు ఏ అవినీతి జరిగినా, ఏ ఉపద్రవం జరిగినా వైఎస్సార్ సీపీకి అంటగట్టడం ఆనవాయితీగా మారిందన్నారు. వర్షాలు, వరదలు వస్తే దానికి వైఎస్సార్‌సీపీ కారణమంటారని, ఓడలో బియ్యం తీసుకెళ్తుంటే దానికి వైఎస్సార్ సీపీ కారణమంటారు, పొద్దున లేచినప్పటి నుంచి కలెక్టర్లను, అధికారులను తిడతారన్నారని అన్నారు. ఇటీవల మూడు రోజుల పాటు కలెక్టర్ల సమీక్ష జరిగితే చంద్రబాబు అభిమాన పచ్చపత్రికలో సోదిచెబుతామమ్మా సోదిచెబుతామని రాశారని ఇది చంద్రబాబు విజన్ అని ఎద్దేవా చేశారు. ఈ ఎన్నికల్లో ఓటరు దేవుళ్ల ఇచ్చిన తీర్పును శిరసావహిస్తామని మేము ప్రతిపక్షంలో ప్రజల పక్షాన నిలబడి ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేలా ప్రభుత్వ మెడలు వంచుతామన్నారు. ఇందుకు అవసరమైతే ఉద్యమాలు చేస్తామన్నారు. ఇప్పటికి ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలైనా ఒక్క హామీ నెరవేరలేదన్నారు. మహిళలు, రైతులు, ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ప్రస్తుతం గ్రామ వాలంటీర్లను పీకారు... రేపు పింఛన్లు పీకే పనిలో పడ్డారు. ఇప్పటిదాకా భూములు, ఆస్తులపై దాడులు జరిగాయని.. ప్రభుత్వ చేష్టల కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. దీంతో గత ప్రభుత్వం ఏం చేసింది, ఈ ప్రభుత్వం ఏం చేస్తుందో జనం బేరీజు వేసుకుంటున్నారని వివరించారు. రాబోయే కాలంలో ఉద్యమ బాట పట్టాల్సిన ఆవశ్యకత ఉందని ఈనెల 27వ తేదీ విద్యుత్ చార్జీల పెంపుపై, జనవరి 3వ తేదీ విద్యార్థులకు బాసటగా జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేస్తామన్నారు.

ప్రస్తుతం అన్ని మండలాల్లో నూతన కమిటీలను వేస్తున్నామని పార్టీకి అండగా ఉండి కష్టపడేవారికి గ్రామ, మండల, జిల్లా స్థాయి పదవులు ఇచ్చి గౌరవిస్తామన్నారు. నియోజకవర్గంలో గత మూడు ఎన్నికల్లో పార్టీ ఓడిపోయిందని, కానీ ఈసారి జరిగే ఎన్నికల్లో కొండపిలో జెండా ఎగురవేయటమే తన లక్ష్యమని చెప్పారు. ఆ ప్రకారం కమిటీలను నియమిస్తామన్నారు. సమస్యలపై పోరాడే వాళ్లు కావాలే కానీ గ్రూపులు కట్టేవాళ్ల అవసరం లేదని ఖరాఖండిగా చెప్పారు. పార్టీ విధానాలు, సిద్ధాంతాల ప్రకారం కమిటీల నియామకం జరుగుతుందని, ఆశావహులు తమ పేర్లు ఇస్తే అందరి అభిప్రాయాలు తీసుకుని వారికి సముచిత స్థానం ఇస్తామని సురేష్ వివరించారు. అంతకుముందు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ వైద్య విభాగం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, మండలంలోని అన్ని గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని ప్రారంభించాలి

- డాక్టర్ల బదిలీ వెంటనే నిలిపివేయాలి
- సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఎం నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

మార్కాపురం: మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించి, డాక్టర్ల బదిలీ నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు డీ సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కళాశాల అవసరాన్ని, ప్రాధాన్యతను గుర్తిస్తూ సబ్‌కలెక్టర్ వెంటనే ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. వెనుకబడిన పశ్చిమ ప్రకాశం జిల్లా కేంద్రంగా మార్కాపురాన్ని ఏర్పాటుచేస్తూ, మెడికల్ కళాశాలను కొనసాగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని అన్నారు. కళాశాలకు అనుబంధంగా ఉన్న జీజీహెచ్‌లో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్లను బదిలీ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. కాలేజీ నిర్మాణం ఆగిపోవడం, డాక్టర్ల బదిలీల వలన పశ్చిమ ప్రకాశం ప్రజలకు ఉచిత నాణ్యమైన వైద్యం దూరమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దళితులు, గిరిజన ప్రజలు అవస్థలు పడతారని అన్నారు. నూతనంగా ఏర్పడిన టీడీపీ కూటమి ప్రభుత్వం కళాశాల పనులు ప్రారంభిస్తూ డాక్టర్ల బదిలీలను రద్దుచేయాలని డిమాండ్‌చేశారు. గత ప్రభుత్వంలో జిల్లా ఆస్పత్రిని జీజీహెచ్‌గా మార్చి పెద్ద సంఖ్యలో వైద్యులను నియమించడంతో నాణ్యమైన ఉచిత వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఓపీ 700కు పెరిగిందన్నారు. ఈ పరిస్థితుల్లో కళాశాల నిలిపివేయడం వలన ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటు చేసినా ఉపయోగం లేదన్నారు. ఈ విషయమై వివిధ పార్టీలతో పోరాటం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి రఫీ, మండల కార్యదర్శి గుమ్మా బాల నాగయ్య, రూబెన్, జవ్వాజి రాజు, నన్నేసా, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

- అర్జీదారుల సంతృప్తి స్థాయి పెరిగేలా పనిచేయాలి
- గ్రీవెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా



గ్రీవెన్స్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారంలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. గ్రీవెన్స్ హాలులో సోమవారం మీ కోసం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులు అర్జీల సమస్యలు నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో అర్జీదారుల సంతృప్తి స్థాయి పెరిగేలా యంత్రాంగం పనిచేయాలన్నారు. సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని, పరిష్కారం కాని సమస్యలు ఉంటే అర్జీదారులను పిలిచి వారికి వివరించాలన్నారు. గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, లోకేశ్వరరావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ కార్యక్రమం అర్జీదారులకు మరింత సౌలభ్యంగా ఉండేలా కలెక్టర్ ప్రత్యేక చర్యలతో కార్యక్రమం నిర్వహించారు. అర్జీలు ఉచితంగా రాసేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయడంతో పాటు మెప్మా సిబ్బందితో అర్జీదారులకు ఎటువంటి సందేహాలు లేకుండా అర్జీలను ఎక్కడ ఇవ్వాలి, ఎక్కడ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వంటి వాటిలో దగ్గరుండి సహకరించేలా ఏర్పాటు చేశారు. అంతేకాకుండా శాఖల వారీగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఆయా శాఖల అర్జీలతో ప్రజలు నేరుగా సంబంధిత అధికారులను కలిసేలా ఏర్పాటు చేశారు. గ్రీవెన్స్‌లో మొత్తం 267 అర్జీలు అందాయి.

■ తాళ్లూరు మండలం బొద్దికూరపాడు పంచాయతీ చింతలపాలేనికి చెందిన బుదల టైగర్ గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి తన భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకునేందుకు గ్రామంలోని కొంతమంది ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశాడు. ఎస్సీ కులానికి చెందిన తాను తన తండ్రి చిన్నబ్బాయి 30 ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూమికి సంబంధించి మధ్యలో నుంచి రోడ్డు పడటం వల్ల భూమి రెండు ముక్కలుగా ఏర్పడిందని తెలిపాడు. ఒక పక్కన వచ్చిన 15 సెంట్ల భూమిని గ్రామంలోని ప్రభుత్వ ఉద్యోగితో పాటు పలువురు భూమి వదిలేయాలని బెదిరిస్తున్నారని అర్జీ అందజేశాడు.

■ కొత్తపట్నం మండలానికి చెందిన కుందేటి వెంకటేశ్వర్లు, తిరుపతమ్మ గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి తన కుమారుడు ప్రమాదంలో గాయపడి మెదడుకు దెబ్బ తగలడంతో చూపు, గొంతుతో పాటు కాళ్లు, చేతులు కూడా పనిచేయడం లేదని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కుమారుడితో పాటు గ్రీవెన్స్‌కు వచ్చి అర్జీ అందజేశారు.

■ ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ నాయకులు గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి మహిళా నర్సులకు రక్షణ కల్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు. ఇటీవల సింగరాయకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తి పీహెచ్‌సీలో డ్యూటీలో ఉన్న మహిళా నర్సుపై తెల్లవారుఝామున దాడికి యత్నించాడని దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవడంతో పాటు నర్సులకు రక్షణ కల్పించాలని కోరారు.

విద్యుత్‌ను దుర్వినియోగం చేయవద్దు



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: విద్యుత్‌ను దుర్వినియోగం చేయవద్దని, అవసరం మేరకు వాడుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా సోమవారం ఒంగోలు నగరంలో ఏపీసీపీడీసీఎల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఏపీసీపీడీసీఎల్ జిల్లా ఎస్ఈ కట్టా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ తమీమ్ అన్సారియా జెండా ఊపి ప్రారంభించారు. విద్యుత్ వినియోగం పై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో జిల్లా వ్యాప్తంగా వారం రోజుల పాటు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ భవనం నుంచి ప్రకాశం భవనం వరకు విద్యుత్ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్ తమీమ్ అన్సారియా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రజల్లో విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ర్యాలీలో ఎస్.ఈ వెంకటేశ్వరరావు, ఈఈ హరిబాబు, డీఈఈ పాండురంగారావు పాల్గొన్నారు.



మంచు వేళ మధురఫలం

మండు వేసవిలో వచ్చే మధుర ఫలాలు మంచు కురిసే వేళలోనూ అందుబాటులోకొచ్చి మామిడి ప్రియుల జిహ్వాచాపల్యం తీరుస్తున్నాయి. సాధారణంగా మన ప్రాంతంలో ఉలవపాడు మామిడి కాయలు వేసవిలో కాపునకు వచ్చి మార్కెట్‌లోకి వస్తాయి. అయితే ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రం తూత్తుకుడి ప్రాంతంలో పండించే మామిడి కాయలను తీసుకొచ్చి సంతనూతలపాడు వద్ద రహదారి వెంట ఉంచి విక్రయిస్తున్నారు. ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు చలికాలంలో మామిడి కాయలను చూసి కొనుక్కెళ్తున్నారు.

- సాక్షి, ఒంగోలు



క్లుప్తంగా

వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



దాడుల్లో పాల్గొన్న పోలీస్ అధికారులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని వై.చర్లోపల్లి పరిసర ప్రాంతాల్లో అక్రమంగా నాటు సారా తయారు చేస్తున్న కేంద్రాలపై పోలీస్ అధికారులు, సిబ్బంది సోమవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. భారీగా నిల్వ ఉంచిన బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. ఎస్సై మహేష్ కథనం ప్రకారం.. వై.చర్లోపల్లి పరిసర ప్రాంతాల్లో అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్నారన్న పోలీసులకు విశ్వసనీయంగా సమాచారం అందింది. ఆ మేరకు దాడులు నిర్వహించి 1000 లీటర్ల బెల్లం ఊటను పట్టుకుని ధ్వంసం చేశారు. సారా తయారీకి వినియోగించే డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. దాడుల్లో సిబ్బందితో పాటు స్పెషల్ బ్రాంచ్ ఏఎస్సై గోపాలకృష్ణ పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్ష కేంద్రాల తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు

ఒంగోలు సిటీ: ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు జరుగుతుండగా, ఒంగోలులోని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్షల తీరును ఏకేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించి యూనివర్సిటీకి మంచిపేరు తీసుకురావాలన్నారు. డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఏకేవీకే డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాలలో ప్రశాంత వాతావరణంలో సజావుగా, సక్రమంగా పరీక్షలు నిర్వహిస్తుండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలను 16 నోడల్ కేంద్రాల పరిధిలో మొత్తం 42 పరీక్ష కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏకేయూ పరిధిలోని 88 డిగ్రీ కళాశాలల నుంచి నమోదైన 10,000 మంది విద్యార్థులలో 8,822 మంది విద్యార్థులు (88.22 శాతం) తొలిరోజు పరీక్షకు హాజరయ్యారని ఏకేయూ అదనపు పరీక్షల నియంత్రణ అధికారిణి ఏ భారతీదేవి తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు జరుగుతుండటంపై సంతోషం వ్యక్తం చేశారు.

ఉల్లిపాయల వ్యాపారి హల్‌చల్



వాటర్ ట్యాంక్ ఎక్కిన ఉల్లిపాయల వ్యాపారి చిరంజీవి

ఒంగోలు టౌన్: నగరంలోని కొత్త కూరగాయల దుకాణంలో ఉల్లిపాయల వ్యాపారం చేసే చిరంజీవి వాటర్ ట్యాంక్ ఎక్కి హంగామా సృష్టించాడు. ఇటీవల కూరగాయల మార్కెట్‌లో దుకాణాలు వేలం వేశారు. చిరంజీవికి ఎక్కడో లోపల దుకాణం వచ్చింది. దాంతో దుకాణం ఎదుట కొంత స్థలాన్ని ఆక్రమించుకొని వ్యాపారం చేసుకుంటున్నాడు. వాటిని కూడా తొలగిస్తామని మున్సిపల్ అధికారులు బెదిరించారు. దాంతో ఆందోళన చెందిన చిరంజీవి సోమవారం ఉదయం అద్దంకి బస్టాండు సెంటర్లో ఉన్న వాటర్ ట్యాంకర్ ఎక్కి రచ్చ చేశాడు. కాసేపు ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. స్థానికులు బతిమాలి కిందకు దించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వైద్యులు బదిలీ.. పేదలే బలి

ప్రజలకు మెరుగైన వైద్యం అందకుండా కూటమి సర్కారు అడ్డుపుల్ల

- మార్కాపురం జిల్లా ఆస్పత్రి వైద్యులను వరుసబెట్టి బదిలీ చేస్తున్న ప్రభుత్వం
- 80 మందికి పైగా వైద్యుల్లో ఇప్పటి వరకు 26 మంది బదిలీ
- ఈ నెలాఖరులో మరికొంత మంది వైద్యులను సాగనంపే యోచన
- గత నెలలో 30 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు స్థానచలనం
- నిర్మాణంలో ఉన్న మార్కాపురం మెడికల్ కాలేజీని గాలికొదిలేసిన వైనం

ప్రజా సంక్షేమాన్ని కూటమి సర్కారు పూర్తిగా గాలికొదిలేసింది. ఆత్మస్తుతి పరనిందలతో ఆరు నెలలుగా కాలం వెళ్లబుచ్చిన కూటమి ప్రభుత్వ పెద్దలు పేదలకు అందుతున్న వైద్యంపై పడగ విప్పారు. కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను పేదలకు క్రమంగా దూరం చేసే కుట్రలకు తెరదీశారు. మార్కాపురం జిల్లా ఆస్పత్రిలో ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలే అందుకు నిదర్శనం. సూదికీ, దూదికీ దిక్కులేని విధంగా ఆస్పత్రులను మార్చేసి, పేదలను ప్రైవేట్ ఆస్పత్రుల వైపు మళ్లేలా చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలతోపాటు ప్రజా సంఘాల నాయకులు నిప్పులు చెరుగుతున్నారు.



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మార్కాపురం మెడికల్ కాలేజీలో నియమించిన 30 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను కూటమి ప్రభుత్వం గత నెలలో రాష్ట్రంలోని వివిధ వైద్య కళాశాలలకు బదిలీ చేసింది. అంతే కాదు జీజీహెచ్‌లో సేవలందిస్తున్న 26 మంది వైద్యులను ఈ నెలలో సాగనంపింది.

--- ---

కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీ నిర్మిస్తామని చెబుతున్నప్పటికీ.. జరుగుతున్న పరిణామాలు ప్రజల్లో అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. వైద్యులను బదిలీ చేసి కొత్త వారిని నియమించకపోవడం, మెడికల్ కళాశాల నిర్మాణం నత్తనడకన సాగుతుండటం ప్రజల అనుమానాలకు బలం చేకూరుస్తోంది.



నిర్మాణం నిలిచిన మార్కాపురం మెడికల్ కాలేజీ భవనాలు

మార్కాపురం:

పశ్చిమ ప్రకాశం ప్రజలకు ఉచిత నాణ్యమైన వైద్యం దూరమవుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 475 కోట్ల రూపాయలతో మార్కాపురం మండలం రాయవరం వద్ద మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని ప్రారంభించారు. ఇప్పటికే సుమారు 75 శాతం పనులు పూర్తి చేశారు. మార్కాపురం జిల్లా వైద్యశాలను జీజీహెచ్‌గా మార్చి 80 మందికి పైగా వైద్యులను నియమించారు. మెడికల్ కాలేజీ ఏర్పాటు, స్పెషలిస్టు డాక్టర్ల నియామకంతో 2019 వరకు రోజుకు 150 నుంచి 200 వరకు ఉన్న ఓపీలు 650 నుంచి 700కు పెరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పీపీపీ విధానంలో వైద్యశాలలు నిర్మిస్తున్నామని చెప్పి కాలయాపన చేయడంతో పాటు, బిల్లుల చెల్లింపులో జాప్యం చేయడంతో నవంబర్ 5న నిర్మాణ సంస్థ కొంత సామగ్రిని తరలించింది. గత 20 రోజుల్లో జీజీహెచ్‌లో పనిచేస్తున్న 26 మందికి పైగా వైద్యులు బదిలీపై వెళ్లిపోయారు. మరో 20 మంది వైద్యులకు ఈ నెలాఖరులో స్థాన చలనం కలగనుంది. దీంతో జీజీహెచ్ స్థాయి తగ్గిపోవడంతో పాటు వైద్యుల కొరత ఏర్పడనుంది. స్పెషలిస్టు వైద్యుల బదిలీతో ఓపీ కూడా క్రమంగా తగ్గిపోతోంది.

గత ప్రభుత్వంలో జీజీహెచ్‌గా అప్‌గ్రేడ్

మార్కాపురం వైద్యశాలలో సేవలు పొందేందుకు కర్నూలు జిల్లా శ్రీశైలం, సున్నిపెంటతోపాటు, పుల్లలచెరువు, యర్రగొండపాలెం, గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, పొదిలి, కనిగిరి ప్రాంతాల నుంచి రోగులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో పశ్చిమ ప్రకాశం ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించే దిశగా అడుగులు వేసిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మార్కాపురం జిల్లా వైద్యశాలను సమగ్ర సర్వజన ఆస్పత్రి(జీజీహెచ్)గా అప్‌గ్రేడ్ చేసింది. జిల్లా వైద్యశాలలోని 100 పడకలను 500కు పెంచడంతోపాటు 80 మందికి పైగా వైద్య నిపుణులను నియమించింది. అదే సమయంలో మార్కాపురానికి మెడికల్ కాలేజీ మంజూరు చేసి వైద్య విద్యను సైతం అందుబాటులోకి తెచ్చింది. 150 మెడికల్ సీట్లను భర్తీ చేయాలన్న లక్ష్యానికి అనుకూలంగా ఏర్పాట్లు పూర్తి చేసింది. అనుహ్యంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని పక్కనబెట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు ఆగిపోయాయి. నీట్‌లో కూడా మార్కాపురం మెడికల్ కాలేజిని చేర్చలేదు. ఈ క్రమంలోనే కళాశాల ప్రిన్సిపాల్‌ను నెల్లూరుకు, జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను ఏలూరుకు బదిలీ చేశారు. వీరితోపాటు 30 మంది ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు గత నెలలో కౌన్సెలింగ్ నిర్వహించి ఒంగోలు, గుంటూరు, విజయవాడ, విజయనగరం, విశాఖపట్నం తదితర మెడికల్ కాలేజీలకు ప్రభుత్వం సాగనంపింది.

26 మంది డాక్టర్లు బదిలీ

మార్కాపురం జీజీహెచ్‌లో పనిచేస్తున్న 26 మంది డాక్టర్లను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు బదిలీ చేయడంతో వారు రిలీవ్ అయ్యారు. వీరిలో డాక్టర్లు ఎస్.సుబ్బారెడ్డి, లక్ష్మీకిరణ్, తిరుపతిరెడ్డి, వి సునీత, ఖాజామొహిద్దీన్, రామలింగమ్మ, వంశీకృష్ణ, పీవీ ప్రసాద్, కెవి భారతి, పి. లత, సయ్యద్ అబ్దుల్ వాజీద్, మోహన్‌రాజు, హేమ, రామారావు, సంగీత, ఎస్‌కే మస్తాన్‌వలి, సుష్మ, నాగప్రసాద్, కె.స్రవంతి, కేశవ చంద్ర, వాసవీ, ప్రసాద్‌బాబు, విన్నీ డియార, అనిరుధ్, వెంకటేశ్వర్లు, రమ్యశ్రీ తదితరులు ఉన్నారు. దీంతో వైద్యశాలల్లోని ఆయా విభాగాల్లో వైద్యసేవలు గగనంగా మారాయి. డాక్టర్లు బదిలీ కావడంతో రోగుల సంఖ్య కూడా క్రమేపీ తగ్గుతోంది.

వైద్యుల బదిలీలు ఆపాలి



మార్కాపురం జీజీహెచ్‌లో వైద్యుల బదిలీలను ప్రభుత్వం ఆపాలి. మెడికల్ కళాశాల నిర్మాణాన్ని ప్రభుత్వమే చేపట్టాలి. ఈ విషయమై సీపీఎం ఆధ్వర్యంలో పోరాటం ప్రారంభిచాం. ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలి. నాణ్యమైన వైద్యాన్ని ప్రజలకు ఉచితంగా అందించేలా చర్యలు తీసుకోవాలి.

– సోమయ్య, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు



మార్కాపురం జీజీహెచ్

వేర్వేరు కేసుల్లో నిందితులు అరెస్ట్

- వైపాలెంలో రూ.9.74 లక్షల నగదు రికవరీ : సీఐ ప్రభాకరరావు వెల్లడి
- పొదిలిలో 1.2 కేజీల గంజాయి, 210 కేజీల రాగితీగ స్వాధీనం
- పరారీలో ఉన్న గంజాయి సరఫరాదారు కోసం జల్లెడ
- విలేకరులకు వివరాలు వెల్లడించిన దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ



వైపాలెంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రభాకరరావు



పొదిలిలో మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

యర్రగొండపాలెం: యర్రగొండపాలెం మండలంలో జరిగిన వేర్వేరు సంఘటనల్లో నమోదైన కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.9.74 లక్షలు రికవరీ చేసినట్లు సీఐ సీహెచ్ ప్రభాకరరావు తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. మండలంలోని గుర్రపుశాల ఎస్సీకాలనీలో గత నెల 29వ తేదీ 12 గృహాలలో చోరీ జరిగింది. ఈ కేసులో నిందితుడు మండ్ల రామయ్యను ఎస్సై చౌడయ్య అరెస్ట్ చేసి రూ.6.74 లక్షలు రికవరీ చేశారు. ఎస్సీకాలనీకి చెందిన కూలీలు తమ ఇళ్లకు తాళాలు వేసుకుని పనుల నిమిత్తం హైదరాబాదు, కొండపి ప్రాంతాలకు వెళ్లగా, కొలుకుల గ్రామానికి చెందిన రామయ్య ఆ గ్రామ అల్లుడు కావడంతో తరచూ వెళ్లి చోరీలకు పాల్పడ్డాడు. తొలుత నాలుగు రోజులు గ్రామంలో విద్యుత్ అంతరాయం కలగడాన్ని ఆసరాగా తీసుకుని దొంగతనానికి పాల్పడ్డాడు. నిందితుడు ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగులకు అలవాటుపడి డబ్బు కోసం ఇటువంటి దొంగతనాలకు పాల్పడుతుంటాడని తమ విచారణలో వెల్లడైందని సీఐ తెలిపారు.

సోలార్ బ్యాటరీలు ఎత్తుకెళ్లిన కేసులో..

యర్రగొండపాలెం మండలంలోని పాలుట్ల, గుట్టలచేను గిరిజనగూడేలకు శ్రీశైలం ఐటీడీఏ ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్లాంట్ల నుంచి దాదాపు 600 బ్యాటరీలను ఎవరి అనుమతీ లేకుండా 2023వ సంవత్సరంలో ఎత్తుకెళ్లి అమ్ముకున్నారని సీఐ తెలిపారు. ఈ కేసులో కాకినాడ జిల్లా గండేపల్లి గ్రామానికి చెందిన కె.ప్రసన్నకుమార్ నాయుడు, విశాఖపట్నం జీకే కొత్తవీధికి చెందిన పి.రామకృష్ణ అనే నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.3 లక్షలు రికవరీ చేసినట్లు తెలిపారు. బ్యాటరీలు ఎత్తుకెళ్లే సంఘటనలో పాలుట్ల, యర్రగొండపాలెం ప్రాంతాలకు చెందిన వారు సహాయం చేశారని, వారిని విచారిస్తున్నామని వివరించారు. ఈ రెండు కేసులను చాకచక్యంగా ఛేదించిన ఎస్సై చౌడయ్య, ఆయనకు సహకరించిన పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసులో..

పొదిలి: రాగి తీగ చోరీ, గంజాయి నిల్వ కేసులకు సంబంధించి నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద ఉన్న సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు దర్శి డీఎస్పీ లక్ష్మీ నారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం పొదిలి సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం మేరకు.. స్థానిక ప్రకాశ్‌నగర్‌కు చెందిన ఇట్లా దుర్గారావు, గురునాథం అర్జున్, పోలా మార్తమ్మ, పిచ్చిరెడ్డి కాలనీకి చెందిన పోలా రాఘవ, బొజ్జా కామాక్షి, చాపల్లి కమలమ్మ, టైలర్స్ కాలనీకి చెందిన కట్టా పవన్‌కుమార్, పొదిలమ్మ గుడి ఏరియాకు చెందిన షేక్ బడేషా పిచ్చిరెడ్డితోటలోని బొజ్జా కామాక్షి ఇంటి వద్ద ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పూర్తి స్థాయిలో విచారించగా పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి, హనుమంతునిపాడు, సంతనూతలపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి రాగితీగ చోరీ చేసినట్లు నిందితులు అంగీకరించారు. నిందితుల నుంచి 27 ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన 210 కేజీల రాగి తీగతోపాటు 1.2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరికి గంజాయి సరఫరా చేసిన ప్రధాన నిందితుడు గురునాథం శివ పరారీలో ఉన్నాడని, అతనిని కూడా త్వరలో అరెస్ట్ చేస్తామని తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు. కేసులు ఛేదించడంలో, రూ.1,80,000 విలువైన సొత్తును స్వాధీనం చేసుకోవడంలో చొరవ చూపిన సీఐ టి.వెంకటేశ్వర్లు, ఎస్సై వేమన, హెడ్ కానిస్టేబుల్ ఎండీ షాకీర్, కానిస్టేబుళ్లు ఎం.కోటేశ్వరరావు, డి.రామ్‌భూపాల్, డి.సాలమ్, పి.కృష్ణ, కె.అమీర్‌వలి, ఎస్.బాలమురళి, బి.గౌతమ్‌కుమార్‌ను డీఎస్పీ అభినందించారు.



పొదిలిలో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి, రాగి తీగ

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ టోకరా

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు

ఒంగోలు టౌన్: నెల్లూరు జిల్లా కావలి దగ్గర కచేరి మెట్టకు చెందిన ఒక వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మబలికి తన వద్ద రూ.1.10 లక్షలు తీసుకుని మోసం చేశాడని స్థానిక పేర్నమిట్టకు చెందిన బాధితుడు సోమవారం ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీని కలిసి తనకు జరిగిన మోసాన్ని చెప్పుకున్నారు. ఉద్యోగం రాకపోవడంతో డబ్బు తిరిగివ్వాలని అడిగితే.. జవాబు చెప్పకుండా తప్పించుకుని తిరుగుతున్నాడని వాపోయాడు. అలాగే కొరిశపాడు మండలం రావినూతల గ్రామానికి చెందిన ఒక వ్యక్తి పచ్చాకు పని నిమిత్తం మేస్త్రీగా కాంట్రాక్ట్ కుదుర్చుకుని కొంత డబ్బు చెల్లించి మిగతా 4.5 లక్షల రూపాయలు ఇవ్వకుండా వేధిస్తున్నాడని టంగుటూరు మండలంలోని కాటూరివారిపాలేనికి చెందిన రైతు ఫిర్యాదు చేశాడు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 73 ఫిర్యాదులు అందగా, వారితో ఎస్పీ నేరుగా మాట్లాడి సమస్యలడిగి తెలుసుకున్నారు. వెంటనే ఆయా పోలీసుస్టేషన్ల అధికారులతో ఫోన్లో మాట్లాడి బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఆదేశించారు. చట్టప్రకారం విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు.

బైక్ ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడు

కొమరోలు: మద్యం మత్తులో ఉన్న వ్యక్తి బైక్‌పై వేగంగా వెళ్తూ గుర్తుతెలియని వృద్ధుడిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన కొమరోలు మండలంలోని యర్రపల్లె గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు వివరాలు.. కొమరోలు నుంచి పోరుమామిళ్ల వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం యర్రపల్లె సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్న ఓ వృద్ధుడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై వెంకటేశ్వర్లు నాయక్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి మద్యం సేవించి ఉండటాన్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రెండో రోజూ రైతుల ఆందోళన

- వరినార్లు ఎండుతున్నాయి.. నీటిని విడుదల చేసి ఆదుకోండి
- రాళ్లపాడు కుడి కాలువ వద్ద రెండో రోజుకు చేరిన రైతుల ఆందోళన
- నీటిని విడుదల చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యం



రాళ్లపాడు కుడి కాలువ వద్ద రెండో రోజు ధర్నా చేస్తున్న రైతులు

లింగసముద్రం:

రాళ్లపాడు ప్రాజెక్టు పరిధిలోని కుడి కాలువకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయాలంటూ రైతాంగం సోమవారం కూడా ఆందోళనకు దిగారు. గత పది రోజులుగా కుడి కాలువ గేటు పైకి లేపేందుకు అధికారులు ఉత్తుత్తి ప్రయత్నాలు చేశారని, చైన్‌బ్లాకులతోనే సరిపెట్టి నీటి విడుదలలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని దుయ్యబట్టారు. రోజులు గడుస్తుండడంతో పోసిన వరినార్లు ఎండిపోతున్నాయని, మమ్మల్ని ఆదుకునే నాథుడు లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కుడికాలువ వద్ద రైతులు ధర్నా నిర్వహిస్తుండడంతో వాహనాలు భారీగా నిలిచి ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు.

నీరు విడుదల చేయకుంటే ఆత్మహత్యే శరణ్యం..

ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీరు చేరిందని, కుడి కాలువకు పూర్తిస్థాయిలో నీరు విడుదల చేసేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని, లేకుంటే ప్రాజెక్టు వద్దే ఆత్యహత్యలు చేసుకుంటామని రైతులు హెచ్చరించారు. ప్రాజెక్టులో చేపలు వేసి కాలువకు నీరు విడుదల కాకుండా చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. వరి నారుమడులు, నాటిన నాట్లు ఎండిపోతున్నాయని, నష్టపరిహారం ఎవరు కట్టిస్తారని, తమను ఆదుకునే వారు లేకుండా పోయారని ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ రైతు ప్రాజెక్టులో దూకేందుకు ప్రయత్నించగా అక్కడే ఉన్న పోలీసులు అతన్ని వారించి అక్కడ నుంచి పంపించివేశారు.

తూమును పగులగొట్టి నీరు వచ్చేలా ఏర్పాట్లు

కుడి కాలువ తూముకు ఉన్న గేటు ఊడిపోవడంతో అది పైకి లేపేందుకు అధికారులు తర్జన భర్జనపడి విఫలం కావడంతో సోమవారం కంప్రెషర్ ద్వారా తూమును పగులగొట్టారు. తూమును 70 ఏళ్ల క్రితం రాతి రాళ్లతో కట్టడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగడుగులు మేర రాళ్లను తొలగించి కాలువకు కొంతమేర నీరు వచ్చేలా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ వరలక్ష్మి మాట్లాడుతూ కుడి కాలువకు 100 క్యూసెక్కుల నీరు విడుదల అయ్యేలా చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. వరినార్లు ఎండిపోతున్నాయని, త్వరగా నీరు విడుదల చేస్తే వరినాటే అవకాశం ఉందని, సక్రమంగా నీరు రాకపోతే వరినార్లు, నాటిన నాట్లు ఎండిపోయి నష్టపోవాల్సి వస్తుందని రైతులు చెప్పారు. అయితే ఎన్ని రోజులు ఇలా చేస్తారని, ప్రాజెక్టులో నీరు తగ్గేకొద్ది తూమును పగులగొట్టే అవకాశం లేదని, మాకు ప్రత్యామ్నాయంగా మోటార్లతో కాలువకు పంపింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సోమవారం సాయంత్రం 7 గంటల సమయంలో సీఈ శ్యాంప్రసాద్ కుడి కాలువ తూము వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుడి కాలువకు కొంత నీరు వెళుతుందని తాము గేటును పైకి తీసేందుకు ప్రయత్నాలు చేశామని, అది వీలుకాకపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. విజయవాడ వద్ద బోట్లను తొలగించిన వారితో కూడా మాట్లాడామని రెండు రోజుల్లో వారు కూడా వచ్చి గేటు తీసేందుకు ప్రయత్నాలు చేస్తామని చెప్పారు.